క్లుప్తంగా

బాధితులకు ఆర్థిక సాయం



అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: పొన్నాడ శివారు కోనపాపపేటలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకిళ్లు కాలిబూడిదయ్యాయి. నిరాశ్రయులైన దుమ్ము అప్పల నర్స, బడే బేబీ కుటుంబాలకు మంగళవారం ఎంపీపీ కారే సుధ పరామర్శించి, రూ.5వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ ప్రమాదం విషయాన్ని ఎమ్మెల్యే పెండెం దొరబాబు దృష్టికి తీసుకువెళతానన్నారు. ఆమె వెంట ఉప సర్పంచి కారే ఉదయ్ కిరణ్, ఉమ్మిడి అప్పారావు, ఉమ్మిడి చిన్న, బొందు అప్పలకొండ, పెరుమళ్ళ భూషణం ఉన్నారు.

నేడు పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: మున్సిపల్ కౌన్సిల్ సర్వ సభ్య సాధారణ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన ఉంటుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, అయా మున్సిపల్ విభాగాల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



హైస్కూల్ ఆవరణను శుభ్రం చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సామర్లకోట: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి ఆవరణను శుభ్రం చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉపాధ్యాయులు జి.గోవిందు, ఏఎల్‌వీ కుమారి, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా

సామర్లకోట: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక హెడ్ పోస్టాఫీసు వద్ద ధర్నా చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి మెహర్ కాంప్లెక్స్‌లోని హెడ్ పోస్టు ఆఫీసు వరకు నిరసన ప్రదర్శన నిర్వహించా రు. సీఐటీయు పట్టణ ఉపాధ్యక్షుడు కరణం ప్రసాదరావు, అంగవాడీ నాయకులు టి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన విజయవాడ ధర్నాను పోలీసులు అడ్డుకోవడంపై అంగన్‌వాడీ సిబ్బంది స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన నిర్వహించారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



రహదారి నిర్మాణ పనులను ప్రారంభించిన దవులూరి సుబ్బారావు

సామర్లకోట: స్థానిక 20వ వార్డులో మంగళవారం సీసీ రోడ్డు పనులను మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు ప్రారంభించారు. కొన్నేళ్లుగా విఘ్నేశ్వరా థియేటర్ నుంచి నీలమ్మ చెరువుకు వెళ్లే రోడ్డు వర్షం వస్తే మురుగు కూపంగా మారేది. దాంతో ఇటీవల ఆ ప్రాంతంలో రూ.20 లక్షలతో రోడ్డు డ్రైను పనులు పూర్తి చేశారు. మిగిలిన రోడ్డు పనులకు రూ.8 లక్షలు మున్సిపాలిటీ కేటాయించగా పనులు ప్రారంభించారు. కౌన్సిలర్ చిట్టుమాని రాఘవ, చిట్టుమాని శ్రీనివాసరావు, ఆ ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

నేడు గణపతికి అభిషేకాలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో కొలువైన గణపయ్య

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలోని గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. బుధవారం ఉదయం స్వామి వారికి 108 లీటర్ల ఆవుపాలు, చెరుకు రసం, నదీ జలాలతో విశేష అభిషేకాలు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం గణపతి ఆలయం వద్ద లక్ష్మీ గణపతి హోమం, మహా పూర్ణాహుతి, లక్ష గరిక పూజ జరుగుతాయని తెలిపారు.

ప్రశాంత నిమజ్జనాలకు సహకరించాలి

- అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్
- తీర ప్రాంతాల పరిశీలన

కొత్తపల్లి: గణపతి నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా భక్తులు సహకరించాలని అడిషన్ల్ ఎస్పీ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నిమజ్జన ప్రాంతాలు పొన్నాడ శివారు కోనపాపపేట, ఉప్పాడ శివారు సుబ్బంపేట తీరప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లాలోని తీరప్రాంతాలైన తొండంగి, కొత్తపల్లి, కాకినాడ రూరల్ మండలాలకి సంబంధించి వినాయక నిమజ్జనం కోసం 5 తీరప్రాంతాలను ఎంపిక చేశామని, తొండంగిలో 2, కొత్తపల్లిలో 2, కాకినాడ రూరల్ సూర్యారావుపేటలో ఒకటి ఏర్పాటు చేశామన్నారు. గణపతి నిమజ్జన వాహనాలు మాత్రమే బీచ్‌లోకి అనుమతి ఉంటుందన్నారు. నిమజ్జన ప్రదేశాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులను ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్సై స్వామి నాయుడు ఉన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

గణపతి నిమజ్జన తీరప్రాంతాలను కాకినాడ ఆర్డీఓ ఎంవీవీ సత్యనారాయణ డీఎస్పీ పడాల మురళీకృష్ణారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నిమజ్జన ప్రాంతాల్లో రెవన్యూ, ఆరోగ్య, పోలీస్, మత్స్యశాఖ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గజ ఈతగాళ్ళను అందుబాటులో ఉంచుతామన్నారు. పోలీసులు గుర్తించిన ప్రాంతాల్లో మాత్రమే గణేష్ నిమజ్జనం చేయాలని సూచించారు.



ఉప్పాడ తీరప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సత్యనారాయణ, డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి



గణపతిని నిమజ్జనానికి తీసుకువెళుతున్న భక్తులు



నిమజ్జనాల ప్రదేశాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ అధికారులు

నేటితో ముగియనున్న నవరాత్రులు

కొత్తపల్లి: మండలంలో గణపతి నవరాత్ర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కొత్తపల్లి, వాకతిప్ప, ఉప్పాడ, కొమరగిరి, మూలపేట, కుతుకుడుమిల్లి శివారు నిదానందొడ్డిలో ఏర్పాటు చేసిన గణపతి మందిరల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో ఆలయ కమిటీలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో బుధవారం నుంచి సాగరతీరంలో నిమజ్జన కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ నిమజ్జనాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై స్వామినాయుడు బారీ బందోబస్తును నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నిమజ్జన వేడుకలలో భక్తులు క్రమశిక్షణ పాటించాలని సూచించారు. కమిటీ సభ్యులు నిర్వహించిన రోడ్డు మార్గం గుండానే వాహనాలను నిమజ్జనానికి తరలించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులకు సహరించాలి. మద్యం సేవించి వాహనాలను నడపరాదని, వాహనాల డ్రైవర్లకు లైసెన్స్‌లు తప్పని సరిగా ఉండాలన్నారు. ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డులో నిమజ్జన వాహనాలకు తప్ప మిగిలిన వాహనాలకు అనుమతిలేదని పోలీసులు తెలిపారు.

నిమజ్జనాల్లో నిబంధనలు పాటించాలి

సామర్లకోట: గణపతి నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ముగియడంతో నిమజ్జనాల్లో పాల్గొనే వారు తప్పని సరిగా నిబంధనలు పాటించాలని తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, ఎస్సై పీవీఆర్ మూర్తి అన్నారు. సామర్లకోట గోదావరి కాలువలో గణపతి విగ్రహాలను నిమజ్జనం చేసే ప్రదేశాన్ని మంగళవారం వారు పరిశీలించారు. గణపతి శిబిరాలు ఏర్పాటు చేసుకున్న నిర్వాహకులు పంచారామ ముఖద్వారం వద్ద ఉన్న గోదావరి కాలువ స్నానాల రేవు వద్ద మాత్రమే నిమజ్జనాలను నిర్వహించాలని వారు ఆదేశించారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులు గోదావరి కాలువ రేవులో బారికేడ్లు ఏర్పాటు చేశారు. పోలీసు, రెవెన్యూ సిబ్బంది భద్రతకు ఏర్పాటు చేశారు. 24 గంటలు విధులు నిర్వహించేలా వీఆర్వోలు, పోలీసు సిబ్బందిని నియమిస్తున్నట్లు ఆయా శాఖల అధికారులు తెలిపారు. నిమజ్జనాలు చేసే వారు క్రమ శిక్షణ పాటించాలని అన్నారు. మద్యం తాగి నిమజ్జనాల్లో పాల్గొన్నవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెద్ద విగ్రహాలను క్రేన్‌తో మాత్రమే నిమజ్జనం చేయాలని సూచించారు. నిమజ్జనాలకు వచ్చిన నిర్వాహకులు పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు.

సీఎం జగన్ తీసుకున్నది చరిత్రాత్మక నిర్ణయం

కొత్తపల్లి: గత ప్రభుత్వాలన్నీ బీసీలకు మాయమాటలు చెప్పుకుని వచ్చాయే తప్ప జనగణనపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ అన్నారు. బీసీ జనగణనపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం చాలా గొప్ప పరిణామమన్నారు. ఈ సందర్భంగా మంగళవారం తులసీకుమార్ మాట్లాడుతూ భారత దేశానికి స్వతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బీసీ గణనను జనాభా దామాషా ప్రకారం రాజ్యాధికారం, విద్య, ఉద్యోగ, వనరులు నిధులు, నియామకాల ప్రకారం బీసీల గణన చేపట్టలేదన్నారు. దీనిపై అనేక పార్టీలు, అనేక సంఘాలు పోరాడుతూ వచ్చాయన్నారు. అయినప్పటికీ ప్రభుత్వాలు జంతువులకు, మృగాలకు గణనను చేపట్టారే తప్ప 50శాతం పైబడి ఉన్న బీసీల జనగణనను చేపట్టలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయాన్ని బీసీ వర్గాలు అభినందనలు తెలియజేస్తున్నాయన్నారు. అసెంబ్లీలో ఈ బిల్లును ప్రవేశపెట్టిన బీసీ శాఖామంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

కొత్తపల్లి: నాగులాపల్లి పంచాయతీ నిధులు దుర్వినియోగంపై మంగళవారం పెద్దాపురం డీఎల్‌డీఓ ప్రసాద్, కాకినాడ డీఎల్‌పీఓ అమ్మాజీ విచారణ నిర్వహించారు. పంచాయితీలోని పలు రికార్డులను పరిశీలించారు. పంచాయితీ నిధులు దుర్వినియోగం అయినట్లు గ్రామస్తుల ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. దీనిపై నివేదికను అందజేస్తామన్నారు. విచారణలో ఎంపీడీఓ వెంకటనారాయణ ఉన్నారు.

ప్రతి ఇంటికీ ప్లాన్ అవసరం

కమిషనర్ రామారావు

సామర్లకోట: ప్రతి ఇంటికి ప్లాన్ ఉండేలా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అన్నారు. స్థానిక చిన్నవీధికి చెందిన దుద్దుంపూడి రాజ్‌గోపాల్ డీఎంఏతో పాటు పోలీసు ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేయడంతో కమిషనర్, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఎస్సై మూర్తి మంగళవారం వాస్తవ పరిస్థితులను గమ నించారు. ఇరువర్గాల నుంచి వివరాలను సేకరించారు. ఒకే కుటుంబానికి చెందిన సరిహద్దు వివాదం కోర్టులో ఉన్నదని అధికారులు తెలుసుకున్నారు. రోడ్డు మార్గాన్ని ఆక్రమించారనే ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారి వద్ద నుంచి దస్తావేజులు సేకరించి సర్వే చేసి ఆక్రమణలపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు ఇస్తామని త్రిసభ్య కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ప్లాన్లు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయనే ఫిర్యాదుల మేరకు కమిషనర్ స్పందించారు. ప్లాను లేకుండా చేసిన నిర్మాణాలను పరిశీలించి నోటీసు ఇవ్వాలన్నారు. సర్వే, టౌన్ ప్లానింగ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదుదారు నుంచి సమాచారం సేకరిస్తున్న అధికారులు

సమాచార చట్టంపై అవగాహన పెరగాలి

జిల్లా పంచాయతీ అధికారి విక్టర్

సామర్లకోట: పంచాయతీ కార్యదర్శులకు సమాచార హక్కు చట్టంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణలో ఆయన పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి సోమవారం పంచాయతీ పరిధిలో నిర్వహించే స్పందనకు వచ్చే అర్జీలను గడువులోగా పరిష్కరించాలని, పరిష్కరించలేకపోతే అందుకు కారణాలను దరఖాస్తుదారులకు వివరించాలని సూచించారు. సమాచార హక్కు చట్టం ప్రకారం వివరాలు కోరిన వారికి వాస్తవ పరిస్థితులను వివరిస్తూ బదులివ్వాలని సూచించారు. బడ్జెట్ తయారీ, పాలక మండలి సమావేశాలతో పాటు ప్రతి మూడు నెలలకు ఒకసారి మండల స్థాయి అధికారులతో గ్రామ సభలు నిర్వహించి గ్రామాల్లో ప్రజల నుంచి సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. గ్రామ ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండటానికి స్వచ్ఛత కార్యక్రమాలను పాటించాలని సూచిం చారు. శిక్షణలో ఫాక్యల్టీలు కుమార్‌రాజా, పి.శ్రీనివాసరావు, నిహారిక, ఎస్‌కె మోహీద్దీన్ పాల్గొన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో అల్లూరి, కాకినాడ జిల్లాలోని గ్రేడ్1, గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులకు ఆరు రోజుల పాటు శిక్షణ ఇస్తున్న విషయం తెలిసిందే. అల్లూరి జిల్లా పంచాయతీ కార్యదర్శుల శిక్షణ పూర్తి కాగా జిల్లాలోని చివరి బ్యాచ్ శిక్షణ శనివారంతో ముగుస్తుంది.



కాకినాడ జిల్లా పంచాయతీ కార్యదర్శుల శిక్షణలో మాట్లాడుతున్న డీపీఓ విక్టర్

శానిటరీ వర్కర్లను గౌరవించుకోవాలి

సామర్లకోట: అనంతరం విక్టర్ ఉండూరులోని సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలిం చారు. స్వచ్ఛతా హి సేవలో భాగంగా పారిశుధ్య కార్మికులను గౌరవించుకోవాలని, సంపద తయారీ కేంద్రాలు విజయవంతంగా నిర్వహించడానికి వారే కారణమన్నారు. కేంద్రం ఆవరణలో వర్మీ కంపోస్టుతో పెంచుతున్న మొక్కలను పరిశీలించి సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులను సత్కరించారు. సర్పంచ్ సత్యాడి ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి తోట సత్యనారాయణ, కుమార్‌రాజా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులను సత్కరించిన డీపీఓ, ఇతర అధికారులు

ప్లాట్‌ఫారాలపై స్వచ్ఛమైన తాగునీరు

సామర్లకోట: రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారాలపై ఉన్న తాగునీటి కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ అన్నారు. మంగళవారం స్వచ్ఛ భారత్ వారోత్సవాల్లో భాగంగా తాగునీటిని పరిశీలించారు. ఈ మేరకు తాగునీరు వచ్చే కుళాయిలను శుభ్రం చేయించారు. ప్రతి రోజు బ్లీచింగ్‌తో పంపులను శుభ్రం చేసే విధంగా ఆదేశాలు ఇచ్చారు. అదే విధంగా స్టాల్స్‌లో విక్రయించే తాగునీటి బాటిల్స్‌ను పరిశీలించారు. తాగునీటిని వృథా చేయరాదని సూచించారు. చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టరు కిశోర్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, సీనియర్ సెక్షన్ వర్క్స్ ఇంజినీర్ రవికాంత్, ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్.రామకృష్ణ, చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టరు రామకృష్ణ, చీఫ్ పార్శిల్ సూపర్‌వైజరు మూర్తి తదిరతులు పాల్గొన్నారు.



సామర్లకోట రైల్వే ప్లాట్‌ఫాంపై తాగునీటి కుళాయిలను పరిశీలించిన అధికారులు

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆరుగురికి జరిమానా

సామర్లకోట: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో కాకినాడ కోర్టు ఆరుగురికి జరిమానా విధించినట్లు ఎస్సై పీవీఆర్ మూర్తి తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సోమవారం రాత్రి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని పరీక్షించి ఆరుగురిని కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.60 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

సారా బట్టీలపై పోలీసుల దాడి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చినజగ్గంపేటలో మంగళవారం సారా బట్టీలపై దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్ తెలిపారు. చినజగ్గంపేట గ్రామ శివారులలో సారా తయారు చేస్తున్నట్టు వచ్చిన సమాచారంపై వెళ్లి దాడి చేశామన్నారు. గ్రామానికి చెందిన గాది రాజు, గాది మహాలక్ష్మిని అరెస్టు చేసి, 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

త్యాగాల వారధి చిట్యాల ఐలమ్మ

పెద్దాపురం: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూమికోసం, భుక్తి కోసం పీడిత ప్రజల విముక్తి కోసం దున్నే వాడిదే భూమి అంటూ స్ఫూర్తినిచ్చిన చిట్యాల ఐలమ్మ నేటి తరాలకు త్యాగాల వారధిగా నిలుస్తారని వక్తలు అన్నారు. పట్టణంలోని సీతారామా పట్టణ రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఐలమ్మ జయంతి నిర్వహించారు. సీఐటీయూ నాయకులు నీలపాల సూరిబాబు, డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భర్త, బిడ్డలను కోల్పోయినా పేద ప్రజల కోసం పోరాడిన త్యాగశీలి ఐలమ్మ అని వక్తలు పేర్కొన్నారు. అనంతరం కొబ్బరి మొక్కలు నాటారు. గరగపాటి పెంటయ్య, బంగారాజు, దేవరకొండ సూర్యనారాయణ, కాకినాడ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ జయంతిను పురష్కరించుకుని కొబ్బరి మొక్కలు నాటుతున్న రజక సంఘం నాయకులు

వెల్ఫేర్ అసిస్టెంట్‌పై విచారణ

సామర్లకోట: మండల పరిధిలో పనసపాడు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌పై వచ్చిన ఫిర్యాదులపై మంగళవారం ఎంపీడీఓ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. ఇటీవల గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం సందర్భంగా గ్రామస్తులు, నాయకులు వెల్ఫేర్ అసిస్టెంటర్ తీరుపై ఫిర్యాదులు చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ విధులకు గైర్హాజరు కావడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించినట్లు ఫిర్యాదులు అందడంతో ఎంపీడీఓ డి.శ్రీలలిత వలంటీరు, గ్రామ ప్రజల సమక్షంలో విచారణ నిర్వహించారు. విచారణ బుధవారం కూడా కొనసాగుతుందని ఎంపీడీఓ తెలిపారు. ఈ విచారణలో మండల పరిషత్ వైస్ ఎంపీపీ ములసా శ్రీను, పార్టీ నాయకులు చిట్టిబాబు, మండల స్థాయి అధికారులు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



పనసపాడులో విచారణ చేస్తున్న ఎంపీడీఓ

పిఠాపురానికి ఆర్టీసీ సర్వీసు



సామర్లకోట నుంచి పిఠాపురానికి వెళ్తున్న ఆర్టీసీ సర్వీసు

సాక్షి ఎఫెక్ట్

సామర్లకోట: పిఠాపురానికి షటిల్ బస్సును ఎట్టకేలకు మంగళవారం నుంచి నడుపుతున్నారు. పిఠాపురం రోడ్డులో ఏలేరు కాలువపై ఇరుకు వంతెన కూలిపోవడం మూడేళ్లుగా పిఠాపురానికి బస్సుల రాకపోకలు నిలిపివేశారు. ఏలేరు కాలువపై వంతెనతో పాటు రోడ్డు పనులు పూర్తి కావడంతో షటిల్ బస్సును నడుపుతున్నారు. 'వంతెన పూర్తి చేశారు..బస్సులు నడపరూ' అనే శీర్షికతో గత నెల 31న ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. ఈ మేరకు పిఠాపురం రోడ్డును పరిశీలించి బస్సులు నడపడానికి నిర్ణయం తీసుకున్నారు. సామర్లకోట-పిఠాపురం మధ్య బస్సులు నడపాలని కలెక్టరు నుంచి ఆదేశాలు కూడా రావడంతో ఈ సర్వీసులను నడుపుతున్నారు.

మానస హంతకుడిని కఠినంగా శిక్షించాలి

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

పెద్దాపురం: మైనర్ బాలిక మానస మృతికి నిరసనగా పట్టణంలో మంగళవారం రాత్రి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. మన పెద్దాపురం ఫేస్‌బుక్, సోషల్ మీడియా ఫర్ సొసైటీ, పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. బాలిక ఆత్మకు శాంతి చేకూరాలని, జోహార్ మానస అంటూ నినాదాలు చేశారు. హత్య చేసిన యవకుడుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ సెంటర్ నుంచి మెయిన్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించగా ఆయా ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

భవిత విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

పెద్దాపురం: స్థానిక భవిత విద్యార్థులు క్రీడల్లో విజేతలుగా నిలచిన తీరు అభినందనీయమని మండల విద్యాశాఖాధికారులు శర్మ, చౌదరి అన్నారు. జిల్లా స్థాయి స్పోర్ట్స్‌మీట్‌లో విజేతలుగా నిలిచిన భవిత విద్యార్థులకు మంగళవారం పతకాలు, బహుమతులను వారు అందజేశారు. భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతే విభిన్న ప్రతిభా వంతులకు ప్రభుత్వం ఈ సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యా శాఖ ద్వారా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. సెంటర్ ద్వారా అర్బన్, రూరల్ పరిధిలో విభిన్న ప్రతిభా వంతుల విద్యార్థులకు మెరుగైన వైద్య, విద్య సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఆయా విభాగాల్లో గెలుపొందిన విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.ఆనందరావు, ఫిజియో థెరపీ వైద్యులు అపర్ణ, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విభిన్న ప్రతిభావంతులతో ఎంఈఓలు

ఎఫ్‌సీఐని సందర్శించిన విద్యార్థులు



ఎఫ్‌సీఐ కార్యకలాపాలను తెలుసుకుంటున్న విద్యార్థులు

సామర్లకోట: స్థానిక ఎఫ్‌సీఐ గోదాములను మంగళవారం మేరీ ఇమ్మాక్యులేట్ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ డిపో మేనేజర్ ఎస్.సందీప్, ఇతర అధికారులు వై.శ్రీనివాసరావు, కె.ఏడుకొండలు బియ్యం సేకరణలో ఎఫ్‌సీఐ ప్రాముఖ్యాన్ని వివరించారు. అలాగే నాణ్యమైన బియ్యం తయారీ, ఫోర్టిఫైడ్ బియ్యం ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ బియ్యం నీటిలో తేలడం వల్ల ప్లాస్టిక్ బియ్యం అనే అపోహలు ఉన్నాయని తెలిపారు. ఈ బియ్యంలో అనేక పోషక విలువలు ఉండటంతో చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందజేస్తోందని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ డైసీ, హెచ్ఎం జాయిసీ ఉపాధ్యాయులు రవికుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యానికి మేలు

కొత్తపల్లి: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యానికి ఎంతో మేలు అని మండల వ్యవసాయ శాఖ అధికారి వి.జోగిరాజు అన్నారు. గోర్స గ్రామంలో మంగళవారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. జోగిరాజు మాట్లాడుతూ గోర్స గ్రామంలో సుమారు 200 మంది రైతులు పూర్తి స్థాయిలో ప్రకృతి వ్యవసాయ పంటను సాగు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందిస్తోందన్నారు. ఆర్బీకేలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి. పంటల సాగుపై రైతులు జాగ్రత్తలు పాటించి వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ఎంటీ గణేష్, ఎల్‌టూ సుబ్రహ్మణ్యం, ఐసీఆర్పీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రతి ఇంటికీ వైద్యం

కొత్తపల్లి: ప్రతి ఇంటికీ వైద్యం అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి రమేష్ అన్నారు. పొన్నాడలో మంగళవారం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సర్వే నాగులాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి సర్వే చేపట్టిన గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎగ్జిక్యూటర్ కృష్ణారావు, హెల్త్ సూపర్‌వైజర్ అప్పారావు, వైద్య సిబ్బంది ఉన్నారు.